**WANTED**

**జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.**

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా
మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో
పనిచేయుటకు ఉమ్మడి జిల్లాబ్యూరోలు/
జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది.
అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు..
ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

**సంప్రదించాల్సిన నెంబర్లు:**
**9492580091**

facbook.vaaradhinews.com

# వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:13
సోమవారం,
16.09.2024



## ఖైరతాబాద్‌లో ఫుల్ రష్

- సప్తముఖ మహాగణపతి దర్శనానికి పోటెత్తిన జనం
- ఐమ్యాక్స్ మార్గంలో తొక్కిసలాట
- క్యూలైన్లలో ఊపిరాడక ఉక్కిరి బిక్కిరైన భక్తులు
- దర్శనానికి ఎవరూ రావొద్దంటూ ఉత్సవ కమిటీ ప్రకటన

**వారధి, స్టేట్ బ్యూరో:**
ఖైరతాబాద్‌లోని సప్తముఖ మహాగణపతి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. ఆదివారం సెలవు దినంతో పాటు చివరి రోజు కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. నాలుగు వైపుల నుండి లక్షల సంఖ్యలో తరలి వచ్చారు. ఖైరతాబాద్ గణేష్ వినాయక నిమజ్జనం మంగళవారం అయినప్పటికీ.. సోమవారం నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాల్సి ఉన్నందున భక్తులను దర్శనానికి అనుమతించరు. ఆదివారం మాత్రమే దర్శనానికి అవకాశం ఉండడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఖైరతాబాద్‌కు తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఖైరతాబాద్ భక్తులతో కిటకిటలాడింది. బడా గణేష్ దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.



# మా వాళ్ల జోలికొస్తే వీపు చింతపండే



- బీఆర్ఎస్ నేతలకు సీఎం రేవంత్ వార్నింగ్
- ఇంటికొస్తానని బెదిరించినందుకే దాడి
- ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశాం
- హరీష్.. నీ రాజీనామా ఎక్కడ..?
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సౌమ్యుడు
- ఆయన వెనక నేనున్నా.. జాగ్రత్త
- సెమీఫైనల్ ముగిసింది.. ఇక ఫైనల్ మిగిలింది
- 2029లో రాహుల్‌ను ప్రధాని చేయడమే కర్తవ్యం
- త్వరలో 35వేల ఉద్యోగాల భర్తీ
- సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**వారధి, స్టేట్ బ్యూరో:**
కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే వీపు చింతపండు చేస్తామని బీఆర్ఎస్ నాయకులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. మా వాళ్ల ఇంటికి వస్తామని కొందరు సవాల్ విసిరారు.. మా వాళ్లే వాళ్లింటికెళ్లి బుద్ధి చెప్పారు.. మా ఇళ్లపై దాడి చేశారని ఆరోపిస్తున్నారు. అలాంటప్పుడు దమ్ముంటే రా అంటూ సవాల్ చేయడం ఎందుకు..? మా వాళ్లు ఎవరి జోలికీ వెళ్లరు.. మా జోలికి వస్తే ఊరుకోం అని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం టీపీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గాంధీ భవన్‌లో నిర్వహించిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తే పదవికి రాజీనామా చేస్తానన్న సన్నాసి హరీష్‌రావు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు సీఎం రేవంత్. రుణమాఫీ అయిన రైతుల వివరాలను ఆయనకు పంపిస్తామన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ సౌమ్యుడు కాబట్టి.. ఊర్లలో తమ ఆటలు సాగుతాయని కొందరు అనుకోవచ్చు.. కానీ మహేష్‌కుమార్ గౌడ్ వెనుక తాను ఉన్నానంటూ పేర్కొన్నారు. ఎవరైనా తమ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమంటూ వార్నింగ్ ఇచ్చారు. ప్రజలు విశ్వసించి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూడా.. వరుసగా రెండుసార్లు అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 48 గంటల్లో.. మొదటి రెండు గ్యారంటీలు అమలు చేశామని తెలిపారు. గత ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీని నీరుగార్చిందని.. రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. ఆడబిడ్డలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేశామని, రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమ చేశామని తెలిపారు.

**ముచ్చెర్లలో ఫ్యూచర్ సిటీ**
ముచ్చెర్లలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడతామని.. ప్రపంచానికి ఆదర్శంగా అధునాతన నగరం నిర్మిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. రీజనల్ రింగ్‌రోడ్‌తో తెలంగాణ స్వరూపం మారుతుందన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు సెమీఫైనల్స్.. 2029 ఫైనల్స్‌లో మనం ఘనవిజయం సాధించాలి. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసినప్పుడే ఫైనల్స్‌లో విజయం సాధించినట్టు.. అంటూ పేర్కొన్నారు. రాబోయే పదేళ్లపాటు

2 లో

## నేను ఎప్పటికీ కార్యకర్తనే

- బీఆర్ఎస్‌కు సోషల్ సెన్స్ లేదు
- కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ
- ప్రతి వారం మంత్రులు గాంధీ భవన్‌కు రావాల్సిందే
- నెలలో ఒక్కసారైనా సీఎం వచ్చి వెళ్లాలి
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- గాంధీ భవన్‌లో అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ

2 లో

## రేవంత్‌కు అంత సీన్ లేదు

- కాంగ్రెస్ రెండో సారి గెలవడం అసాధ్యం
- నేనూ నీ ఎత్తు గురించి మాట్లాడగలను
- నాకు సంస్కారం అడ్డొస్తోంది
- రుణమాఫీ పూర్తయ్యే వరకు నీ గుండెల్లో నిద్రపోతా
- ఇకనైనా తిట్ల దండకం మాని.. ప్రజలకు మంచి చెయ్
- సీఎం రేవంత్‌కు హరీష్ రావు స్ట్రాంగ్ కౌంటర్



**వారధి, స్టేట్ బ్యూరో:**
సీఎం రేవంత్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. పదే పదే తన ఎత్తుపై మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు హరీష్ రావు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. హరీష్‌రావుపై కీలక వ్యాఖ్యలు చేయగా.. వాటికి సమాధానంగా తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు రెండు రకాల వరదలతో ఇబ్బంది పడుతున్నారని.. అందులో ఒకటి ప్రకృతి వైపరీత్యం

2 లో



## 33 జీవోతో విద్యార్థులకు నష్టం

- రద్దు చేయాలని బీఆర్ఎస్‌వీ ఆందోళన
- మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి యత్నాలు
- అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

2 లో

## భద్రాద్రి రామయ్య పేరిట రూ.కోట్ల విరాళాల సేకరణ

- యూఎస్‌ఏ నిర్వాహకులపై భద్రాద్రి ఈవో ఫైర్
- తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిక
- దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు

2 లో



## చిట్టినాయుడు టీడీపీలోనే ఉన్నారా?

- గాంధీపై చెప్తున్న లాజిక్ ఆయనకూ వర్తిస్తదా?
- అతి తెలివితో కోర్టును మోసం చేయలేరు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వారధి, స్టేట్ బ్యూరో:** మంత్రి శ్రీధర్‌బాబు చెప్తున్న లాజిక్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంకా టీడీపీలోనే ఉన్నట్టేనా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 'అతి తెలివి మంత్రీ.. మీ 'చిట్టినాయుడు' ఇంకా టీడీపీలోనే ఉన్నారా?' అని ఎక్స్ ద్వారా నిలదీశారు. మంత్రి దుద్దిళ్ల చెప్తున్నది నిజమే అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్ల చుట్టూ తిరిగి కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న సన్నాసి ఎవరని మండిపడ్డారు. పార్టీలో చేర్చుకోవడం ఎందుకు? ఆపై పదవులు పోతాయన్న భయంతో నాటకాలు ఎందుకని ప్రశ్నించారు. అతి తెలివితో కోర్టును మోసం చేద్దాం అనుకున్నా ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.

**గురుకులాలను పట్టించుకోరా..?**
గురుకులాలపై చిన్నచూపు ఎందుకని కాంగ్రెస్ సర్కారును కేటీఆర్ ప్రశ్నించారు. ఒకటో తారీఖునే జీతాలు చెల్లిస్తామని అబద్ధాలు ప్రచారం చేసి సమయానికి జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు గడిచేదెలా అని ప్రశ్నించారు. గురుకులాల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణలేదని, వారి

2 లో

# కౌన్ బనేగా ఢిల్లీ సీఎం..?

- రేసులో ముగ్గురు కీలక నేతలు
- రాజీనామాకు సిద్ధమైన అరవింద్ కేజ్రీవాల్
- రెండు రోజుల్లో పదవి వదిలేస్తానని ప్రకటన
- అనంతరం కొత్త సీఎం పేరు ప్రకటన

**వారధి న్యూస్, న్యూఢిల్లీ**
మరో రెండు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. దీంతో ఢిల్లీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ క్రమంలో ఢిల్లీ సీఎం పదవిని కేజ్రీవాల్ ఎవరికి అప్పగిస్తారనే విషయంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతుంది. సీఎం రేసులో కేజ్రీవాల్ భార్య సునీత, మంత్రులు అతిషి, సౌరభ్ భరద్వాజ్ పేర్లు వినిపిస్తున్నాయి. మరి వీరిలో ఎవరికి కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పగ్గాలు ఎవరికి అప్పగించే అవకాశం ఉందనేది సస్పెన్స్‌గా మారింది.

**భార్యకు అప్పగిస్తారా..?**
ఢిల్లీ సీఎం బాధ్యతలను కేజ్రీవాల్ తన భార్య సునీతకు అప్పగిస్తారనే చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల నుంచి సునీత సీఎం పీఠాన్ని అధిరోహిస్తారని ఊహాగానాలు వినిపించాయి. దేశంలోని ఇతర రాజకీయ ప్రాంతీయ పార్టీల మాదిరిగానే సీఎం పదవిని కేజ్రీ



తన కుటుంబ సభ్యులకే అప్పగిస్తారా? లేదా ఇతరులకు అవకాశం ఇస్తారా? అనే దానిపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బిహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ తాను జైలుకు వెళ్లిన సమయంలో తన భార్య రబ్రీ దేవీకి సీఎం పీఠాన్ని అప్పగించారు.

# ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

- **దక్షిణ తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర ఖమ్మంకు చేరుకుంది**

**వారధి న్యూస్, ఖమ్మం:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ప్రారంభించిన 33 జిల్లాల చైతన్య యాత్రలో భాగంగా దక్షిణ తెలంగాణ ఉద్యమకారుల యాత్ర బృందం ఆదివారం ఖమ్మంకు చేరుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యమకారులు ఈ సందర్భంగా ఘన స్వాగతం పలికారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫారం చైర్మన్ డాక్టర్ కె.వి. కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ హాజరై, మయూరి సెంటర్ అమరవీల స్థూపం వద్ద అమర వీరులకు నివాళులర్పించారు.ఈనెల 27వ తేదీన సికింద్రాబాద్ హరి హర కళభవనంలో జరుగనున్న ఉద్యమకారుల సన్మాన కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో, 33 జిల్లాల ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ప్రొఫెసర్ చీమ శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ, "ప్రతి ఉద్యమకారునికి 250 చదరపు గజాల స్థలం, 25 వేల రూపాయల పెన్షన్, ఉద్యమకారుల గుర్తింపు కార్డులు, మరియు 10 వేల కోట్లు బడ్జెట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, తదుపరి పోరాటం తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అరవపల్లి విద్యాసాగర్, పసుపులేటి నాచరయ్య, పగడాల నరేందర్, బచ్చల పద్మాచారి, రవి చంద్ర చౌహాన్, షేక్ నాగుల్ మీరా, నందిగామ జానీ, మంచి కంటి నరేష్, లింగన్న బోయిన సతీష్, మరియు ఇతర నేతలు పాల్గొన్నారు.మరియు అమరవీరుల స్థూపం నుండి బాబురావు పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు.






# వినాయక విగ్రహాన్ని బహూకరించిన బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొడిగెలి శ్రీనివాస్

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** నారాయణ పెట్ జిల్లా మరికల్ గ్రామంలోని అశోక్ నగర్ కాలనీలో, "వక్రతుండ యూత్ అసోసియేషన్ కమిటీ" కి వినాయక విగ్రహాన్ని బహూకరించిన సందర్భంలో, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొడిగెలి శ్రీనివాస్ మరియు వినాయక యూత్ కమిటీ సభ్యులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా, వినాయక కమిటీ సభ్యులు తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తూ, బొడిగెలి శ్రీనివాస్ మరియు ఇతర సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# బాలకృష్ణారెడ్డికి నివాళులు అర్పించిన బండ్రు ప్రభాకర్

- **తెలంగాణ ఉద్యమ నాయకుడికి శ్రద్ధాంజలి**

**వారధి న్యూస్, ఆలేరు:** ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు జిట్ట బాలకృష్ణారెడ్డి మరణం తెలంగాణకు తీరని లోటు అని తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రభాకర్ అన్నారు. ఆదివారం, యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి కన్వెన్షన్ హాలులో నిర్వహించిన దశదినకర్మలో, ఆమె బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభాకర్ మాట్లాడుతూ, "తెలంగాణ ఉద్యమంలో ప్రశ్నించే గొంతుగా నిలిచి, మొట్టమొదటి ఫ్లోరైడ్ రహిత నీటి పరిచయం చేసిన గొప్ప సుజలదాత స్వర్గీయ బాలకృష్ణారెడ్డి," అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు ఇతరులు కూడా పాల్గొన్నారు.




# మూఢనమ్మకాలు జన జీవనానికి ప్రమాదం

- **ప్రొఫెసర్ కె.నాగేశ్వర్**
- **ముగిసిన జన విజ్ఞాన వేదిక ఐదవ రాష్ట్ర మహాసభలు**

**వారధి న్యూస్, కుషాయిగూడ:** మూఢనమ్మకాలు సమాజానికి మరియు జన జీవనానికి ప్రమాదకరమని ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ అన్నారు. ఆదివారం, ఏ.ఎస్.రావు నగర్ లోని అణుపురం కమ్యూనిటీ హాలులో నిర్వహించిన జన విజ్ఞాన వేదిక ఐదవ రాష్ట్ర మహాసభలు ముగిసాయి.

ఈ సందర్భంగా, ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ, శాస్త్రీయ విధానాలతో సమాజాన్ని చైతన్యపరిచి సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని, అందుకు జన విజ్ఞాన వేదిక పూర్తిస్థాయిలో పని చేస్తుందని తెలిపారు.

విద్యాశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ, భారతదేశం సైన్స్ టెంపర్ను మరింత పెంపొందించుకోవాలని, మరియు విజ్ఞానాన్ని శాస్త్రీయ దృక్పథంలో పెంపొందించుకోవాలని సూచించారు.

**ఈ మహాసభల్లో 8 తీర్మానాలు ఆమోదించబడ్డాయి:**

1. మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలి.
2. విద్యా కమిషన ఏర్పాటు చేసి, శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలి.
3. పాఠశాల విద్య మరియు ఉన్నత విద్యలో మత పరమైన అంశాలను బోధనాంశాలుగా ఉండకూడదు.
4. వైద్య సేవలు వ్యాపార దోరణిలు లేకుండా, ప్రభుత్వ ఆధీనంలో ఉండాలి.
5. శాస్త్ర సాంకేతిక కమిషన్ ఏర్పాటు చేయాలి.
6. తెలంగాణ సైన్స్ మ్యూజియం రాష్ట్రకేంద్రంలో, జిల్లాల్లో సైన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
7. హైడ్రా సమర్థవంతంగా నిర్వహించాలి, మధ్యతరగతి నిర్మాణాలను కులగొట్టకూడదు, పేదలకు ప్రత్యామ్నాయ గృహవసతి కల్పించాలి, చెరువులు, కుంటల సంరక్షణ కూడా హైడ్రా పరిధిలోకి తీసుకోవాలి.
8. మత్తు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్ నిషేధించాలి.

**నూతన కమిటీ ఎన్నిక**

జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీ (202426):
అధ్యక్షులు: చెలిమెల రాజేశ్వర్
ఉపాధ్యక్షులు: ప్రొఫెసర్ కె. లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ బి.ఎన్. రెడ్డి, ఎస్.జితేందర్, అలవాల నాగేశ్వర రావు, ఆర్. వెంకటేశ్వరరావు, రావుల వరప్రసాద్
ప్రధాన కార్యదర్శి: రాజా
కార్యదర్శులు: రవీందర్ రెడ్డి, గంగరాజు, వెంకటరమణారెడ్డి, మహేంద్రం, శ్రీనివాసరావు, వెంకటరమణ
కోశాధికారిగా: నాగరాజు
మరో 11 మంది కమిటీ సభ్యులతో ఈ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది.

# ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి

- **సిద్దిపేట, దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో ఘటన**

**వారధి న్యూస్, సిద్దిపేట:** ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఒక బాలుడు మృతిచెందిన దురదృష్టకర ఘటన దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో జరిగింది. దుబ్బాక ఎస్ ఐ గంగరాజు వెల్లడించిన వివరాల ప్రకారం, కొమరవెల్లి మండలం గౌరాయిపల్లి గ్రామానికి చెందిన బండి నవీన (28) తన తల్లి తో పండగకు అందరి గ్రామానికి వచ్చిన సందర్భంగా, ఆదివారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో చెరువులో బట్టలు ఉతికేందుకు తన తల్లి రేణుక మరియు మరదలు కావ్యతో కలిసి చెరువుకు వెళ్లారు. బాలుడు సాయి (7)ను చెరువులో స్నానం చేయించి, గట్టు పైకి పంపించగా, బట్టలు ఉతికే క్రమంలో సాయి కనిపించకపోవడంతో, రేణుక తన తమ్ముడు స్వామి కు సమాచారం అందించింది. స్వామి చెరువులో వెతకగా, బాలుడు సాయి శవంగా కనపడి బాధిత కుటుంబం తీవ్ర శోకసమాధి చెందింది. ఈ ఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ గంగరాజు తెలిపారు



# మెట్రో లో ప్రయాణించిన జిహెచ్ఎంసి మేయర్

- **నిమజ్జనం వేళ మెట్రో సమయాలు పెంపు**

**వారధి న్యూస్ హైదరాబాద్ :** జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి ముసరాంబాగ్ నుంచి ఎల్బీనగర్ వరకు మెట్రోలో ఆదివారం ప్రయాణించింది. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జనం రోజు మెట్రో సమయం పెంపు గురించి అధికారుల కు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు కొన్ని సూచనలు ఇచ్చారు. మెట్రో సేవల గురించి ప్రయాణికులను అడిగిన తెలుసుకున్నారు.

# మా వాళ్ల జోలికొస్తే వీపు చింతపండే

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు సీఎం రేవంత్. 1994 నుంచి కొనసాగుతున్న పొలిటికల్ ట్రెండ్ గురించి వివరించారు. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సౌమ్యుడని.. అలా అని ఎవరైనా రెచ్చిపోతే ఆయన వెనుక నేనున్నా అన్న సంగతి గుర్తుపెట్టుకోవాలన్నారు. త్వరలో 35వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు.

# చిట్టినాయుడు టీడీపీలోనే ఉన్నారా?

**మొదటిపేజీ తరువాయి**

ప్రాణాలకు భరోసా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వక వారి కుటుంబాలను రోడ్డున పడేస్తారా? అని ప్రశ్నించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఒక్కరోజూ విద్యా వ్యవస్థపై సమీక్ష లేదని విమర్శించారు. విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న తంగలపల్లి గిరిజన గురుకుల పీఈటీనీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ నీతిమాలిన చర్యలను ధైర్యంగా ఎండగట్టిన విద్యార్థులకు తాము అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

**వ్యవసాయ చిచ్చు మొదలైంది..**

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ రాగానే వ్యవసాయానికి కౌంట్ డౌన్ షురూ అయిందని కేటీఆర్ విమర్శించారు. పదేండ్లు పచ్చగా ఉన్న తెలంగాణలో వ్యవసాయ చిచ్చుమొదలైందని విమర్శించారు. వ్యవసాయ విప్లవం సాధించిన తెలంగాణలో సాగువిస్తీర్ణం తగ్గడం కౌంట్ డౌన్‌కు తొలి ప్రమాద హెచ్చరిక అని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలసాగులో పంజాబ్‌నే తలదన్నే స్థాయికి అనతికాలంలోనే ఎదిగామని ఆనందపడ్డాం. దశాబ్దాలపాటు దగాపడ్డ తెలంగాణ రైతన్న దేశం కడుపునింపే ఎత్తుకు ఎదిగాడని గర్వపడ్డాం. ఆర్థికంగా చితికిపోయిన అన్నదాతల బతుకులు వ్యవసాయ విప్లవంతో బాగుపడ్డాయని సంబురపడ్డాం. కానీ, కాంగ్రెస్ రాగానే వ్యవసాయానికి కౌంట్ డౌన్ షురూ అయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# భద్రాద్రి రామయ్య పేరిట రూ.కోట్ల విరాళాల సేకరణ

- **యూఎస్ఏ నిర్వాహకులపై భద్రాద్రి ఈవో ఫైర్**
- **తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిక**
- **దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు**

**వారధి న్యూస్, భద్రాచలం:**

భద్రాచలం రామయ్య ఆలయం పేరిట యూఎస్ఏకు చెందిన భద్రాద్రి శ్రీ రామటెంపుల్ నిర్వాహకులు కోట్ల రూపాయల విరాళాలు సేకరిస్తున్నారని భద్రాద్రి ఆలయ ఈవో రమాదేవి ఆరోపించారు. ఈ విషయంలోనే యూఎస్ఏ ఆలయ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఈరోజు భద్రాద్రి శ్రీ రామటెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరుతో భద్రాచలంలోని ఆర్య వైశ్య సత్రంలో సీతారాముల కల్యాణం చేసేందుకు సిద్ధపడగా ఈవో అడ్డుపడ్డారు. భద్రాద్రి పేరుతో విరాళాలు ఎలా సేకరిస్తారని మండిపడ్డారు. భద్రాచలం పేరును ఎలా ఉపయోగిస్తున్నారని ప్రశ్నించారు.ఇప్పటికే భద్రాద్రి శ్రీరామ టెంపుల్ యూఎస్ఏ పేరుతో కోట్ల రూపాయలు విరాళాలు సేకరించారని తెలుసుకున్న ఈఓ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. యూఎస్ఏలోని అట్లాంటా నగరంలో భద్రాద్రి నమోనాతో పోలిన ఆలయాన్ని నిర్మించి ఖగోళ యాత్రలో అనేక చోట్ల సీతారాముల కల్యాణాన్ని చేస్తున్నట్లు గుర్తించినట్లు ఈవో ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరుతో భద్రాచలంలోని ఆర్యవైశ్య సత్రంలో సీతారాముల కల్యాణం చేసేందుకు ఇవాళ సిద్ధపడగా వారిని ఆమె అడ్డుకున్నారు.

భద్రాద్రి పేరుతో ఎవరు విరాళాలు సేకరించినా, భద్రాద్రి ఆలయం పేరును వాడినా తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ వివాదంపై మీడియా సమావేశం నిర్వహిస్తుంచిన ఈవో, పలు వివరాలను వెల్లడించారు. భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పేరును వాడిన, మూలవరుల చిత్రాలు ఉపయోగించిన, భద్రాద్రి పేరుతో విరాళాలు సేకరించిన కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎల్.రమాదేవి తెలిపారు. భద్రాద్రి, శ్రీ రామ టెంపుల్ ఆఫ్ యుఎస్ఏ పేరుతో అమెరికాకు చెందిన ఆలయ నిర్వాహకులు విరాళాలు సేకరిస్తున్నారని కనుగొన్నట్లు ఈవో తెలిపారు. ఆ అంశంకు సంబంధించి పాంప్లెట్లు పరిశీలించగా అసలు విషయం బయటపడిందన్నారు. భద్రాద్రి పేరును వారి వెబ్‌సైట్‌లో కూడా వాడి విరాళాలు సేకరించారని ఈవో తెలిపారు. భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ వారు భద్రాద్రి ఆలయాన్ని పోలిన గుడిని అమెరికాలోని అట్లాంటా నగరంలో రూ.300 కోట్ల బడ్జెట్‌తో నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోందన్నారు.ఈ విరాళాలన్నీ ఈ పేరు మీదనే సేకరించారా లేక ఇంకా ఏ విధంగా సేకరించారు అనే విషయాలు తెలియాల్సి ఉందన్నారు. ప్రస్తుతానికి భద్రాద్రి మూలవరుల ఫొటోలపై, భద్రాద్రి పేరుపై పేటెంట్ హక్కులు తీసుకుంటామని ఆమె తెలిపారు. అలానే భద్రాద్రి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొనరాదని రమాదేవి ఆదేశించారు.



# నేను ఎప్పటికీ కార్యకర్తనే

**వారధి, స్టేట్ బ్యూరో:**

టీపీసీసీ అధ్యక్షుడినైనా తాను కార్యకర్తగానే ఉంటానని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్ ఒక దేవాలయమని, విబేధాలు పక్కకు పెట్టి అందరూ కలిసి పనిచేయడంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. తాను ఇప్పటికీ ఇద్దరు విభిన్నమైన వ్యక్తులతో కలిసి పనిచేశానన్నారు. ఒకరు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మరొకరు రేవంత్ రెడ్డి.. ఇద్దరూ భిన్నమైన వ్యక్తులని చెప్పారు. ఇక కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఎక్కువగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ నాయకులు అందరినీ కో ఆర్డినేట్ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. అందరూ కలిసి పనిచేస్తున్నారని మహేష్ కుమార్ అన్నారు.

**గాంధీ భవన్‌తో 40 ఏళ్ల అనుబంధం**

నాకు గాంధీ భవన్‌తో 40 ఏండ్ల అనుభందం ఉంది. గాంధీ భవన్‌లో నేను తాకని ప్రదేశం లేదు. ప్రజాస్వామ్యయుతంగా నేను ఉంటాను. కౌశిక్ రెడ్డి వాడిన భాష వల్లనే గాంధీ అనుచరులు వాళ్ళ ఇంటి మీద దాడి చేశారు. మనది రాయలసీమ కాదు. కేసీఆర్ సీఎం అయ్యాక భాష మారిపోయింది. కేసీఆర్ భాషకు రేవంత్ భాషతో సమాధానం చెప్పారు. అందుకే మనం అధికారంలోకి వచ్చాం. నేను టీపీసీసీ అధ్యక్షుడిని అవుతాననుకోలేదు. నా స్థాయికి నేను ఈ పదవి చేపడతాననుకోలేదు. నాకు ఇన్ని రోజులు పదవులు ఎందుకు రాలేదని నేను అనుకోలేదు. పని చేస్తూ వెళ్ళాను. రాజకీయాల్లో ఎంత కష్టపడి పనిచేసినా ఒక్క శాతం అదృష్టం ఉండాలి. అందుకే నాకు ఎమ్మెల్సీ వచ్చింది. నాకు పీసీసీ వచ్చింది. సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణను కేసీఆర్ కుటుంబం కోసం వాడుకున్నాడు. 9 నెలలలో 18,000 కోట్ల రుణమాఫీ చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాను సోషల్ సెన్స్ లేకుండా వాడుతున్నారని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో పవర్ సెంటర్‌లు లేవు. ఒక్కటే పవర్ సెంటర్. అది రాహుల్ గాంధీ పవర్ సెంటర్. గాంధీ భవన్‌లో 6 గంటలు ఉంటాను. కమ్యూనిస్టు పార్టీలకు ఉన్న ఆస్తులు ఎవరికీ లేవు. మనకు కూడా జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ఉండాలి. జిల్లాలో పార్టీ కార్యాలయం కోసం స్థలం కేటాయించండి. ప్రతి వారం ఇద్దరు మంత్రులు గాంధీ భవన్‌కు రావాలి. బుధవారం ఒకరు శుక్రవారం ఒక మంత్రి అందుబాటులో ఉండాలి. నెలలో ఒకసారి సీఎం సీఎం కూడా గాంధీ భవన్‌కు రావాల్సిందేనన్నారు.

# రేవంత్‌కు అంత సీన్ లేదు

**మొదటిపేజీ తరువాయి**

వల్ల వచ్చిన వరదలైతే.. రెండోది మాత్రం సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాల వరద అంటూ ఎద్దేవా చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో వచ్చిన బురదను కడుక్కునే అవకాశం ఉందని.. కానీ రేవంత్ రెడ్డి అబద్ధాలు మాత్రం మోరీ కంపును మించి పోయాయంటూ చురకలంటించారు.తన గురించి తన ఎత్తు గురించి పదే పదే సీఎం రేవంత్ రెడ్డి కామెంట్లు చేస్తున్నారని ప్రస్తావించిన హరీష్ రావు.. తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. తాటిచెట్టంతా పెరిగావు.. దూలంలా పెరిగావు.. దూడ కున్నంత మెదడు లేదనటమే కాకుండా.. సన్నాసి ఏడ దాక్కున్నావు అని కూడా తననుద్దేశించి మాట్లాడారని హరీష్ రావు పేర్కొన్నారు. తన ఎత్తు గురించి మాట్లాడిన రేవంత్ రెడ్డిని.. తాను కూడా లిల్లీపుట్ అంత లేవని గానీ.. అదే సన్నాసి అనే పదాన్ని తిరిగి అనటం పెద్ద కష్టమైనా పనా అని ప్రశ్నించారు. కానీ.. అలా అనడానికి తనకు మర్యాద, సంస్కారం అడ్డొస్తున్నాయని హరీష్ రావు తెలిపారు. తన ఎత్తు మీద ఎందుకంత అంత ఈర్ష్య అని రేవంత్ రెడ్డిని హరీష్ రావు అడిగారు. అది భగవంతుడు తనకు ఇచ్చిన వరమన్నారు. తన ఎత్తు గురించి ఎంత తిట్టినా.. ఎంత మాట్లాడినా తన అంత ఎత్తు పెరగలేవంటూ సెటైర్లు వేశారు. తన ఎత్తు గురించి మాట్లాడం మానేసి.. రైతుల గురించి ఆలోచించాలని హితవు పలికారు. తాను తాటిచెట్టంతా ఎదిగినా.. అందులో తప్పేముందని.. నీవు వెంపలి చెట్టంతా కూడా ఎదగలేదు కదా..? నీకు దేవుడు అంతే ఇచ్చాడంటూ తనదైన శైలిలో ఘాటు కౌంటరే ఇచ్చారు.

**కాంగ్రెస్‌కు అంత సీన్ లేదు..**

రుణమాఫీ జరిగితే రాజీనామా చేస్తా అన్న సన్నాసి ఎక్కడ దాక్కున్నావ్.. అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా హరీష్ రావు ఘాటుగానే స్పందించారు. తాను ఎక్కడా దాక్కోలేదని.. నీ గుండెల్లోనే నిద్ర పోతున్నానంటూ వ్యాఖ్యానించారు. నిద్ర పట్టనివ్వకుండా చేస్తూ.. ప్రతిక్షణం రుణమాఫీ గురించి గుర్తుచేస్తున్నానని తెలిపారు. ఇప్పటికే సగం రుణమాఫీ చేయించానని.. మిగతా సగం రుణమాఫీ చేసేంత వరకు కూడా వెంట పడుతూనే ఉంటానన్నారు హరీష్ రావు.



# 33 జీవోతో విద్యార్థులకు నష్టం

**వారధి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ స్థానికత కోసం వైద్య విద్యలో జీవో నెంబర్ 33ను ఉపసంహరించి ఎంబీబీఎస్ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్ నుంచి మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్వీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. ప్రభుత్వం ఉదాసీనత వల్ల ప్రైవేట్ మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీ హోదాకు దరఖాస్తు చేసుకున్నాయని, తద్వారా 50 శాతం కన్వీనర్ కోట సీట్లు పొందగాలియని చెప్పారు. ఇలా హోదా పొందడం వల్ల తెలంగాణ విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆరోపించారు. ప్రతిభ కలిగిన పేద, మధ్యతరగతి విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ఆ కుట్రలో భాగంగానే జీవో నెంబర్ 33ను కొనసాగించేందుకు ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టును ఆశ్రయించిందని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడేందుకు దాఖలు చేసిన పిటిషన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని గెల్లు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS

# జనరల్ న్యూస్

## మహా గణపతి పూజలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ అదం విజయ్ కుమార్

- **యువ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి వేడుకలు**



**వారధి న్యూస్ హైదరాబాద్:** సీతాఫల్ మండి యువ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను గత 20 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నాము అని కమిటీ తెలిపింది. ఈ సంవత్సరం కూడా స్నేహితుల తో కలిసి మహాగణపతి మండపాన్ని ఏర్పాటు చేసి ఘనంగా గణనాథునికి పూజలు నిర్వహిస్తున్నాము అని తెలిపారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే, సీతాఫల్మండి మాజీ కార్పొరేటర్ అదం విజయ కుమార్ యువ ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన గణపతి పూజలో పాల్గొన్నారు. సాంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమిటీ ఆర్గనైజర్ కిరణ్, మహేష్, సన్నీ, దుర్గ, బాల, ప్రదీప్, శేఖర్, చింటు, రామ్,లను అభినందించారు. కార్యక్రమంలో మిత్రులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు



- **తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలందుకున్న గణనాథులు.**
- **ప్రతిరోజు భజనలు, కోలాటాలతో భక్తులను కనువిందు చేసిన కార్యక్రమాలు.**
- **అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన ప్రతిష్ఠ సంఘాలు**

**వారధి న్యూస్ పెబ్బేరు:** పెబ్బేరు మండలం మరియు పట్టణంలో కేంద్రంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సందర్భంగా మండపాలలో కొలువు దీరిన లంబోదరులకు తొమ్మిది రోజులు భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండపాల దగ్గర భజన బృందాలచే హరి భజనలు, అదుగుల భజనలు, పిల్లల నృత్య కార్యక్రమాలు మరియు మహిళలచే కోలాటాలు, బొమ్మలు రకరకాల విన్యాసాలచే వినాయకుని నవరాత్రి ఉత్సవాలు ప్రజలు తొమ్మిది ఘనంగా జరుపుకుంటున్నారు. పెబ్బేరు లోని భక్త ఆంజనేయస్వామి ఆలయం లో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం దగ్గర శివ మారుతి సేవా సమితి ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న వినాయ కునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేయించి వారు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో శివ మారుతి సేవ సమితి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎస్ ఐ హరి ప్రసాద్ రెడ్డి




**వారధి న్యూస్ పెబ్బేరు:** పెబ్బేరు జామ మసీదులో మసీద్ ఏ మూస యూత్ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాని పెబ్బేరు ఎస్ ఐ హరి ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. రక్తదాన శిబిరానికి 30 మంది యువకులు రక్తదానం చేసినట్టు వారు తెలిపారు.సందర్భంగా ఎస్సై హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సేవాగుణంతో కులమతాలకి అతీతంగా మంచి పేరు తెచ్చుకోవాలని ఈ దేశ అభివృద్ధికి కులమతాలకతీతంగా ఎంతోమంది సేవ చేసి మంచి పేరు సంపాదించుకున్నారని ఆ విధంగానే యువత అంతా కూడా దేశ అభివృద్ధికి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో మస్జిద్ ఎ మూస కమిటీ ప్రెసిడెంట్ మతీన్, ఖద్దూస్, మజీద్,జానీ, అర్బాజ్, మొయినుద్దీన్, బురాన్, భాష, నయ్యూమ్, రహీం,కమల్, నవాల్,ఆయుబ్, ఎంఐఎం మండల పార్టీ అధ్యక్షులు ఎండి అఫ్రోజ్ ,ఉప అధ్యక్షుడు జకీర్,కరీమ్, అమెర్, ఇర్ఫాన్, సమీర్, మునీర్, ముజ్జు, ముస్తాక్, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## వనపర్తి గణపతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి సందడి

**వారధి న్యూస్, వనపర్తి:** గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వనపర్తి పట్టణం శనివారం రాత్రి సందడిగా మారింది. అర్ధరాత్రి వరకు వినాయక మండపాలను సందర్శించేందుకు బైకుల ర్యాలీగా వెళ్లిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రెడ్డి, శారదా రెడ్డి దంపతులకు కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు. వెంకటేశ్వర ఆలయం, చింతల ఆంజనేయ స్వామి ఆలయం, రాయిగడ్డ అమ్మవారి గుడి, గాంధీ చౌక్ పెద్దమ్మతల్లి దేవాలయం సహా పలు ప్రాంతాలలోని వినాయక మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే దంపతులు పూజలు చేసి, వినాయకుడు ఆశీర్వాదం పొందారు. మహిళలు డప్పు దరువులతో, బొడ్డెమ్మలతో ఉత్సాహంగా పాల్గొని, యువకులు ఎమ్మెల్యే దంపతులకు శాలువాలు కప్పి సన్మానించారు .ఈ సందర్భంగా చిన్నారులు ఎమ్మెల్యే మేఘా రెడ్డి తో సెల్ఫీ దిగేందుకు పోటీ పడ్డారు. కాలనీ వాసులు కూడా సెల్ఫీలు తీసుకుంటూ ఎమ్మెల్యే ని అభినందించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ చందర్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకానాటి కృష్ణయ్య, కౌన్సిలర్ నందిమల్ల భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కన్నెత్తి చూసినా కటకటాల్లోకి వెళ్తారు జాగ్రత్త

- **మహిళల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసిన "షి టీమ్ " బృందం**



**వారధి న్యూస్ హైదరాబాద్:** రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో షీ టీం బృందం రద్దీ ప్రాంతాలలో ప్రతి క్షణం పోకిరిల కదలికను గమనిస్తుందని తెలిపిపారు . సీసీటీవీ కెమెరా లతో మహిళా భద్రత కోసం కటిదిట్టం చేశాముని అన్నారు . రద్దీ ఉన్నచోట ఎవరూ పట్టించుకోరని, మహిళలు,యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారో, మీకు కటకట పాలే. దురుద్దేశం తో కన్నెత్తి చూసిన జైలుకు వెళ్తారని హైదరాబాద్ పోలీసులు ఒక వీడియో విడుదల చేశారు.





## జర్నలిస్టుల సమస్యలపై పోరాడే సంఘం టీ డబ్లూ జె ఎఫ్

- **రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**
- **ఘనంగా కరీంనగర్ జిల్లా మహాసభ**

**వారధి న్యూస్, కరీంనగర్:** సమాజంలో బాధ్యత గల పౌరులుగా జర్నలిస్టులు వృత్తి ధర్మాన్ని పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. అదే సమయంలో జర్నలిస్టులపై జరిగే దాడులను ఐక్యంగా ఎదుర్కొంటూ హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ పట్టణంలోని ఎల్ జీ ఆర్ ఎవెంట్స్ భవన్ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా నాల్గవ మహాసభ ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ప్రత్యామ్నాయ యూనియన్ టీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూనే, జనం సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్యంలో ప్రధాన భూమిక పోషిస్తున్న జర్నలిస్టులు తమ హక్కుల కోసం సంఘటితంగా ఉండాలని అన్నారు. నిరంతర అధ్యయనం, ప్రజా సమస్యలపై కథనాలు అందిస్తూ సమాజంలో తమకంటూ స్థానం పొందాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు పేరుకుపోయి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయని, గత ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేశాయని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను ఇప్పటికే కొత్త ప్రభుత్వానికి విన్నవించామని, ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది మాసాలు గడిచినా పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు, పెన్షన్ స్కీం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఫెడరేషన్ పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న ఇతర జర్నలిస్టు సంఘాలకు ప్రత్యామ్నాయం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అని, జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం ఇదేనని అన్నారు. కొన్ని జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వంలో పదవులు పొంది పాలకులకు తలొగ్గుతూ జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తున్నాయని, పదవులు, పైరవీల కోసం జర్నలిస్టులను పావులుగా వాడుకుంటున్నారని విమర్శించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు పూర్తిచేసి హక్కుల సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫె డరేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ నివేదిక సమర్పించారు. మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం, పెన్షన్ స్కీం వంటి డిమాండ్ల సాధనకు ఐఎఫ్ డబ్ల్యూజే దేశవ్యాప్తంగా పోరాటం చేస్తుందన్నారు. ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ మాట్లాడుతూ, టీడబ్ల్యూజేఎఫ్ సంఘం ఏ ప్రభుత్వానికి,ఏ పార్టీకి అనుకూలం,అనుబంధం కాదని, కేవలం జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనే లక్ష్యంగా పని చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిగ రఘు, కార్యదర్శులు రాజశేఖర్, బిక్షపతి, జాతీయ కౌన్సిల్ సభ్యులు కుడుతాడి బాపురావు,యూసుఫ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయ్, మహేష్, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గం ఇన్చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, ప్రముఖ వైద్యులు బీ ఎన్ రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మహా గణపతి పూజలో పాల్గొన్న యువ నాయకుడు తీగుళ్ల రామేశ్వర్ గౌడ్

- **గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలి**

**వారధి న్యూస్ హైదరాబాద్ :** గణేష్ నవరాత్రుల ఉత్సవాల లో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ యువ నేత తీగుల్ల రామేశ్వర్ గౌడ్ సితాఫలమండీ, తార్నాక, అడ్డగుట్ట, బౌద్ధానగర్, మెట్టుగూడ డివిజన్లలో వివిధ వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాగణపతి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజల పై ఎల్లప్పుడూ ఉండాలని ఆ దేవుని వేడుకున్నానని అయన తెలిపారు . ఈ కార్యక్రమంలో రామేశ్వర్ గౌడ్ తో పాటు ఆయన బృందానికి, పార్టీ నాయకుల కు స్థానిక గణేష్ మండప నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు.



## నేడే నాగపూర్ సికింద్రాబాద్ వందే భారత్ రైల్ ప్రారంభం

- **వర్చుల్ వల్ పద్ధతిలో ప్రారంభించనున్న ప్రధానమంత్రి మోడీ**

**వారధి న్యూస్ హైదరాబాద్ :** నాగపూర్ నుంచి సికింద్రాబాద్ మార్గం లో నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ పద్ధతి లో వందే భారత్ రైల్ ను ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. నాగపూర్ నుంచి ఉ. 5 గంటలకు బయలుదేరి మ. 12: 15కు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి మ. 1గంటలకు బయలుదేరి రా. 8:20కు నాగపూర్ చేరుకుంటుంది. కాజీపేట, రామగుండం, బల్లర్ష, చంద్రపూర్, సేవగ్రాం లో హల్డింగ్ లో ఉంటుంది.



## జిల్లా దస్తావేజులేఖరుల సంఘం అధ్యక్షుడిగా సంద రమేష్

- **సన్మానించిన వాకిటి శ్రీధర్**

**వారధి న్యూస్, వనపర్తి:** వనపర్తి జిల్లా దస్తావేజులేఖరుల సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంద రమేష్‌ను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడంలో దస్తావేజు లేఖరి ముఖ్య పాత్ర పోషిస్తారని, వారి బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వారి సేవల ద్వారా సమాజంలో మంచి పేరు పొందవచ్చని, రిజిస్ట్రేషన్ కార్యకలాపాల్లో ఎలాంటి తప్పులు లేకుండా ప్రజలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. నూతనంగా ఎన్నికైన సంద రమేష్‌కు బొల్లం నగేష్, కంచరవి అయ్యప్ప సేవ సమితి అధ్యక్షులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొలెమోనీ అంజి, రుడావత్ అంజి నాయక్, ఎస్ రాము తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా గణేష్ నిమజ్జనం జరుపుకోవాలి

- **మహబూబ్ నగర్ ఎస్పీ ఆదేశాలు**



**వారధి న్యూస్, మహబూబ్నగర్:** శాంతియుతంగా గణేష్ నిమజ్జనం నిర్వహించాలని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాలు జారీ చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శోభా యాత్రలు నిర్వహించే కమిటీలకు మరియు ప్రజలకు ఆమె పలు సూచనలు చేశారు. డిజె సౌండ్ బాక్సులు వాడరాదు, అలాగే శోభా యాత్రలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలని ఎస్పీ తెలిపారు. విద్యుత్ తీగలు, వాహనాల రాకపోకలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు ఇచ్చారు. అశ్లీల నృత్యాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టే పాటలు ప్రదర్శించరాదని, అలాగే బాణాసంచా నిషేధం విధించామని తెలిపారు. నిమజ్జనం సమయంలో నీటి దగ్గర జాగ్రత్తలు పాటిస్తూ చిన్నారులను దగ్గరికి రానీయకుండా చూడాలని సూచించారు.


## గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు సిఐటియు మద్దతు

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** గ్రామపంచాయతీ కార్మికులు గత 12 నెలలుగా జీతాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక సార్లు కలెక్టర్, డిపిఓ, ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీలకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ, కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వారు 13వ తేదీ నుంచి సఫాయి పనులు బంద్ చేసి సమ్మె ప్రారంభించారు.ఈ సమ్మెకు సిఐటియు మహబూబ్ నగర్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఒక ప్రకటనలో మాట్లాడుతూ, కార్మికులపై సెక్రటరీ బెదిరింపులకు పాల్పడడం ఆపాలని, సమ్మె విరమించకపోతే సస్పెండ్ చేస్తామని, రిమూవ్ చేస్తామని చెప్పడం దారుణమనిహితవు పలికారు.జీతాలు ఇవ్వకుండా పని చేయాలని ఒత్తిడి చేయడం సరికాదని, సెక్రటరీ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, గతంలో ఆరు నెలల జీతాలు ఇస్తానని చెప్పి మోసం చేశారని కురుమూర్తి ఆరోపించారు. సమ్మె చేస్తున్న కార్మికులకు గ్రామస్తులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కోరుతూ, వెంటనే జీతాలు చెల్లించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.



## డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్

**వారధి న్యూస్, వనపర్తి:** వనపర్తి పట్టణంలో దాదాపు అర్థ శతాబ్దం కాలంగా ప్రజలకు సేవ చేస్తూ, ప్రజల్లో విశేషమైన ఆదరణ పొందిన డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన సందర్భంగా, వారిని చిన్ననాటి నుంచి అభిమానించే వ్యక్తిగా ఉన్న 30వ వార్డు మాజీ కౌన్సిలర్ సతీష్‌యాదవ్, వార్డు సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించారు. గాంధీ చౌక్ ప్రాంతంలో క్లినిక్ నిర్వహిస్తూ, చుట్టుపక్కల గ్రామాలకు, ముఖ్యంగా పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తూ పేరు తెచ్చుకున్న విశ్వేశ్వర్ రెడ్డి తక్షణ నివారణ కలిగించే వైద్య విధానానికి ప్రసిద్ధి చెందారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ, "వారి దగ్గర చికిత్స తీసుకుంటే ఏ రోగమైనా తక్కువ ఖర్చుతో తగ్గిపోతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజేత రాములు, గుంట్ల విష్ణు, బాలస్వామి, నిఖిల్ గౌడ్, రాకేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## టిపీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

- **ఘనంగా సత్కరించిన రాచాల యుగేందర్**

**వారధి న్యూస్, వనపర్తి:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎంపీ నూతన అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆదివారం హైదారాబాద్ లోని గాంధీ భవన్లో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా, రాచాల మాట్లాడుతూ, "రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీలకు అవకాశం ఇవ్వడం హర్షనీయమని" అభిప్రాయపడ్డారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహూల్ గాంధీ, మరియు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం మరియు బీసీలకు పార్టీ పగ్గాలు అప్పజెప్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



## తెలంగాణ రైతాంగ పోరాట వీరుడు దొడ్డి కొమరయ్యపై సినిమా తీయాల్సిందే..

- జిల్లా చైర్మన్-డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్
- అన్ని కుల సంఘాల కలయికతో సినిమా నిర్మాణం
- జిల్లా కన్వీనర్ భూపతి నారాయణ గౌడ్

**వారధి న్యూస్, సూర్యాపేట :** తెలంగాణ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం తన ప్రాణాలను అర్పించిన దొడ్డి కొమరయ్య జీవితం ఆధారంగా ఆయనపై సినిమా నిర్మాణం చేయనున్నామని, ఆయన పోరాట ప్రతిభను ప్రపంచానికి తెలియ జేయడమే ఈ చిత్ర నిర్మాణ లక్ష్యమని సినిమా దర్శకుడు సేనాపతి వెల్లడించారు. ఆదివారం సూర్యాపేటలో జరిగిన సమావేశంలో దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భూపతి నారాయణ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా, సూర్యాపేట జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ, "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరుడైన దొడ్డి కొమరయ్య జీవిత కథ ఆధారంగా అన్ని కుల సంఘాల సహకారంతో సినిమా నిర్మాణం జరుపుతున్నాం," అని తెలిపారు.భూపతి నారాయణ గౌడ్ మాట్లాడుతూ, "ప్రతి జిల్లాలో 30 మంది సహ నిర్మాతలుగా, వారి నుంచి రూ.10,000/ పెట్టుబడి ద్వారా సినిమాను నిర్మించనున్నాం. 33 జిల్లాల నుండి వెయ్యి మందితో ఈ సినిమా నిర్మాణం జరుగుతుందని" వివరించారు.ఈ సమావేశంలో సూర్యాపేట జిల్లా నుండి సహనిర్మాతలుగా డాక్టర్ వి. రామ్మూర్తి యాదవ్, వసంత సత్యనారాయణ, చలమల్ల నరసింహ, తల్ల మల్ల హుస్సేన్, కోన మల్లయ్య, బెల్లంకొండ శ్రీరాములు, అప్పం శ్రీనివాసరావు, పోలేపల్లి శ్రీనివాస్, ఎం. వీరేంద్ర వర్మ, మీసాల వెంకటరమణ, బుడిగం నరేష్ కుమార్, గండపనేని ప్రభాకర్ రావు, బి. కృష్ణ వేణి చేరారు. చలమల్ల నరసింహ కోచైర్మన్‌గా, బెల్లంకొండ శ్రీరాములు కోకన్వీనర్‌గా ఎన్నికయ్యారు.ఖమ్మం జిల్లా నుండి షేక్ అబ్దుల్ రెహమాన్, భూక్య కృష్ణ నాయక్, మరియు వివిధ కుల సంఘాల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## మాషమ్మ కుంటలో గుర్తు తెలియని పురుష మృతదేహం

**వారధి న్యూస్, వనపర్తి:** అప్పాయిపల్లి గ్రామ పరిధిలోని మాషమ్మ కుంటలో ఒక గుర్తు తెలియని పురుష మృతదేహం లభించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతదేహం 40 నుండి 50 సంవత్సరాల వయస్సు గల పురుషుడిగా గుర్తించబడింది. సమాచారం ప్రకారం, మృతదేహం అనుమానితంగా 1020 రోజుల క్రితం నీటిలో తేలుతూ, కాటుకలతో మట్టుకు చిక్కినట్లు తెలుస్తోంది. మృతదేహం తెలుపు రంగులో, పొడవుగా 5.8 అంగుళాలు మరియు మధ్యతరహా బరువు ఉన్నట్లు తెలిపింది.ఈ ఘటనను ఆదివారం మాషమ్మ కుంటలో గుర్తించిన అనంతరం, అప్పాయిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగర్ల ఉమాదేవి వాల్ ద్వారా కంప్లయింట్ అందించబడింది.

## గిరిజన ఆశ్రమ పాఠశాల కు తాళం వేసిన శ్రీదేవిని సస్పెండ్ చేయాలి

**వారధి న్యూస్, వనపర్తి:** బంజారా గిరిజన విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్, గిరిజన ఆశ్రమ పాఠశాలపై తాళం వేసిన ఎగ్జిట్ టీచర్ శ్రీదేవిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శివ నాయక్ మాట్లాడుతూ, "ఉద్యోగులు ఇలాంటి ప్రవర్తనను కొనసాగిస్తే, పిల్లలకు న్యాయం ఎలా జరుగుతుందా? ప్రభుత్వం ఇటువంటి ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. మరియు, "ఉన్నత అధికారి చెప్పిన బదిలీ అయినా, సీనియర్ ఉద్యోగికి గౌరవం లేకుండా తాళం వేసి న్యాయసమ్మతంగా వ్యవహరిస్తున్న శ్రీదేవి పాఠశాలపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. వనపర్తి జిల్లా కలెక్టర్ చెప్పిన ఆదేశాలను కూడా పట్టించుకోకుండా



అలా వ్యవహరించటం సరైన విషయం కాదు. భవిష్యత్తులో ఇలాంటి ఉదంతాలు మళ్ళీ జరగకుండా, శ్రీదేవిని వెంటనే సస్పెండ్ చేయాలి" అని పేర్కొన్నారు.



## యాదగిరిగుట్టలో ప్రత్యేక పూజలు చేసిన తీన్మార్ మల్లన్న

**వారధి న్యూస్, భువనగిరి:** యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్సీ నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న) మరియు ఆయన కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతకుముందు, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి, ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎ.భాస్కర రావు శ్రీ స్వామి వారి ప్రసాదంగా లడ్డు అందజేశారు.






## ట్యాంక్ బండిలోనే గణేష్ నిమజ్జనానికి పూర్తి ఏర్పాట్లు చేయాలి

- లేదంటే యథా విధంగా మండపాలలో గణేష్ లు ఉంచుతాం
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి

**వారధి న్యూస్ హైదరాబాద్:** రేపు జరగబోయే గణేష్ నిమజ్జనం హుస్సేన్ సాగర్ లో లేదంటూ పోలీసులు ట్యాంక్ బండ్ పై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను, భారీ కెడ్లను తొలగించిన భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితినేతలు.
ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన జాలీలను తొలగించి వినాయకుని నిమజ్జనం చేసిన ఉత్సవ సమితి నేతలు. హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం అనేక సంవత్సరాల నుండి వస్తుంది గుర్తు చేశారు. ఇప్పుడు కొత్త గా రూల్స్ తీసుకువచ్చి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని గణేష్ ఉత్సవ సమితి నాయకులు అన్నారు. గతంలో 2022 , 23లో కూడా ఇదే విధంగా చెప్పారు,కానీ చివరకు హుస్సేన్ సాగర్ లోనే గణేష్ నిమజ్జనాలు జరిగిందన్న విషయాన్ని ప్రభుత్వానికి గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ట్యాంక్ బండ్ పై గణేష్ నిమజ్జనలు చేసే విధంగా పూర్తి ఏర్పాట్లు చేయాలి అని ప్రభుత్వం ని కోరిన ఉత్సవ కమిటీ నాయకులు . లేనిపక్షంలో ఈ రోజు అన్ని వినాయక మండపాల నిర్వాహకులకు సమాచారం తెలియజేసి, నగరా వ్యాప్తంగా ఆందోళన చేసి నగరాన్ని స్తంభింప చేసి, ఎక్కడి కక్కడ మండపాల్లో వినాయకులను అదే విధంగా ఉంచుతాము అని ప్రభుత్వాన్ని హెచ్చరించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు జి.రాఘవ రెడ్డి ప్రధాన కార్యదర్శి రాజా వర్ధన్ రెడ్డి. ఈ కార్యక్రమం లో కార్యదర్శి రావినూతల శశిధర్ , అలె భాస్కర్, సికింద్రాబాద్ కన్వీనర్ భాస్కర్ గిరి, వెంకటేష్, సురేష్, దీర్ సింగ్, గంగాధర్, సందీప్, దిలీప్, తరుణ్, నరేష్ తో పాటు నాయకులు, భక్తుల తో కలిసి నిమజ్జనం చేశారు. ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## వనపర్తి పట్టణంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వారధి న్యూస్, వనపర్తి:** వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ గంజ్ లో ఉన్న శ్రీ లక్ష్మి గణపతి ఆలయానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, అలాగే 23వ వార్డులోని గణనాథుని దర్శించుకుని పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్స్ బండారు కృష్ణ, స్టార్ రైమ్, కంచే రవి, నాయకులు ప్రేమ్ నాథ్ రెడ్డి, జాత్రు నాయక్, ఎర్ర శ్రీను, బలిజపల్లి శశి వర్ధన్ రెడ్డి, దొడ్ల రాములు, మహేశ్వర్ రెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి, గులాం ఖాదర్ ఖాన్, మాజీ సర్పంచ్ గౌడ నాయక్, సూర్య వంశం గిరి, మాధవ రావు సునీల్ వాల్మీకి, జోహెబ్ హుసేన్, చిట్యాల రాము, యుగంధర్ రెడ్డి, మంద రాము, అరిఫ్ పాషా, ఏ కే పాషా, దానియేలు, ముద్దు ఫిర్, పజల్, ఖలీల్, పుష్పక్ యాదవ్, బంగాలి రఘు, J.కార్తిక్, నరేందర్ రెడ్డి, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## నాగం జనార్ధన్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్

**వారధి న్యూస్, హైదరాబాద్:** భారత రాష్ట్ర సమితి (బి.ఆర్.యస్) పార్టీ సీనియర్ నాయకులు నాగం జనార్ధన్ రెడ్డిని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య సమస్య తర్వాత కోలుకున్న నాగం గారిని కేటీఆర్ పరామర్శించి, ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు .ఈ సందర్భంగా, మాజీ మంత్రి వర్యులు ప్రస్తుత ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, బాల్క సుమన్, గువ్వల బాలరాజ్, బింగాల గణేష్, కొరకంటి చందర్ మరియు ఇతర పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## ట్యాంక్ బండ్‌లో నిమజ్జనం చేయకుండా ఏ శక్తులు ఆపలేవు

లేదంటే మండపాలే మందిరాలవుతాయి

- హెచ్చరించిన సికింద్రాబాద్ నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ గిరి

**వారధి న్యూస్ హైదరాబాద్:** మంగళవారం ట్యాంక్ బండ్ లో వినాయక నిమజ్జనం ఎట్టి పరిస్థితుల్లో జరిపి తీరుతామని గణేష్ ఉత్సవ సమితి సికింద్రాబాద్ నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ గిరి తెలిపారు. ఆనవాయితీగా ఎన్నో సంవత్సరాల నుండి ట్యాంక్ బండ్లోనే నిమజ్జనాన్ని చేస్తున్నారనే విషయాన్ని ప్రభుత్వం మార్చిందని అన్నారు. ఈ నిమజ్జనాన్ని ఆపే శక్తి ఏ ప్రభుత్వానికి లేదని ముక్త కంఠంతో ఉత్సవ సమితి నాయకులు వెల్లడించారు .హై కోర్టు నిమజ్జనం పై ఎటువంటి నిషేధం విధించలేదు అని తెలిపారు.ప్రజల ధార్మిక హక్కుల పై ఆంక్షలు పెట్టాలని ప్రయత్నిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు అన్నారు . అలాంటి పరిస్థితి వస్తే భాగ్యనగరంలో ఎక్కడికక్కడ విగ్రహాలతో స్తంభింపజేసి,మండపాలన్నీ మందిరాలవుతాయి అన్నారు . నిమర్జనం పై ప్రభుత్వం మొండికేస్తే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హెచ్చరిస్తుంది.



## భవన నిర్మాణ రంగ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

- నిరసన కార్యక్రమం

**వారధి న్యూస్, వనపర్తి:** తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం కడుకున్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ నిరసనలో కడుకున్ భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షులు భారత్ మాట్లాడుతూ, కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, కానీ కొన్ని కార్మిక వర్గాలు ఇంకా లబ్ధి పొందలేదని వివరించారు. భారత్ సూచించినట్లుగా, ఇన్సూరెన్స్ అమలును ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థలకు అప్పజెప్పడం వల్ల కార్మిక వర్గానికి నష్టం జరుగుతోందని, మరియు సేకరించిన డబ్బులు పక్క దారి పట్టే అవకాశం ఉందని చెప్పారు. ఇన్సూరెన్స్ అమలును ప్రభుత్వమే సంక్షేమ బోర్డు ద్వారా కొనసాగించాలని, కార్మిక సంఘాల ప్రాతినిధ్యం కూడా ఉండాలని కోరారు. అలాగే, సహజ మరణానికి ప్రస్తుత నిధి 1 లక్ష 30 వేల రూపాయల బదులు 5 లక్షల రూపాయలు, ప్రమాదమరణానికి 10 లక్షల బీమా, పెళ్లికానుక ప్రసూతి సాయానికి 30 వేల రూపాయల బదులు 1 లక్ష రూపాయలు ఇవ్వాలని, 55 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరికి సంక్షేమ బోర్డు ద్వారానే పెన్షన్ స్కీములు అమలు చేయాలని, పిఎస్ సౌకర్యం కల్పించాలని, వృత్తిపరమైన పనిముట్ల కొనుగోలు కోసం షరతుల లేకుండా ఐదు లక్షల రూపాయల సబ్సిడీతో కూడిన రుణాన్ని అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమం కడుకున్ గ్రామంలో 18వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాను నిర్వహించాల్సిన అవసరం ఉందని, కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు చిలక బుచ్చన్న, జి శ్రీనివాసులు, వై వెంకటేష్, చంద్రయ్య, ఆదినారాయణ, శ్రీనివాసులు, రామస్వామి, ఆంజనేయులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వారధి న్యూస్, వికారాబాద్:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు తక్షణం ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదివారం సాయంత్రం టేలి కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. ఈ సందర్భంగా ఆయన, ఈ నెల 17న కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించాల్సిన ప్రజా పాలన దినోత్సవం కోసం వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లు, ముఖ్య అతిధుల ఆగమనం, పోలీస్ గౌరవ వందనం, తెలంగాణ జాతీయ సాంగ్ ప్లే, జిల్లా అభివృద్ధి పై స్పీచ్, త్రాగునీటి ఏర్పాట్లపై సమగ్ర ఆదేశాలు జారీ చేశారు. మండల, గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే అధికారులు కూడా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ప్రోటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు



పంపాలని, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ టే లి కాన్ఫరెన్స్‌లో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్ డి ఓ వాసు చంద్ర, మండల స్పెషల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.




## వెనుకబడిన కుల సంఘాల ఏకత్వానికి పిలుపు

- బీసీ లందరూ ఏకతాటి పైకి వచ్చి రాజ్యాధికారం సాధిద్దాం
- రాష్ట్ర బీసీ ఐక్యవేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి గోపాలకృష్ణ పిలుపు

**వారధి న్యూస్, వికారాబాద్:** బీసీ సంఘాలు సామాజిక న్యాయానికి అనుకూలంగా ఉన్న రాజకీయ పార్టీలు, అభిమానుల సమావేశం ఆదివారం పరిగి పట్టణంలోని బీసీ భవన్ లో నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ ఐక్యవేదిక ఆర్గనైజర్ సెక్రటరీ కస్తూరి గోపాలకృష్ణ, జనరల్ సెక్రటరీ ఆర్కే సాయన్న ముదిరాజ్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.

**ఏకత్వానికి పిలుపు**

వికారాబాద్ జిల్లా బీసీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో, పార్టీలకు అతీతంగా బీసీ లందరూ ఏకమై ఒకే తాటిపైకి రాగలిగితే, రాజ్యాధికారం సాధ్యమవుతుందనిలు పిలుపునిచ్చారు.

**సమావేశంలో ప్రధాన అంశాలు**

గోపాలకృష్ణ: బీసీ లందరూ ఏకతాటి పైకి వచ్చి, సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ఆర్కే సాయన్న ముదిరాజ్: బీసీల ఐక్యతే ముఖ్యమని, అన్ని పార్టీలు ఏకమై సామాజిక న్యాయం కోసం చైతన్యంతో ముందుకు పోవాలని అన్నారు.
బేరి రామచంద్ర యాదవ్: బీసీల ఐకమత్యమే మనకు ముఖ్యం, ఇందుకు అన్ని పార్టీలు, సంఘాల సమన్వయం అవసరమని చెప్పారు.

**ఆవేదన**

ఈ సందర్భంగా, బీసీల హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలను ఎలక్షన్ సమయంలో విడిపోతున్న పార్టీలు, జెండాలను మోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 42% రిజర్వేషన్ కోసం ఇప్పటికే పోరాటాలు జరిగాయని, ప్రభుత్వం దీనిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**భవిష్యత్తు కార్యచరణ**

రాబోయే స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వానికి హెచ్చరించారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మరిన్ని సమావేశాలు, పోరాటాలు కొనసాగనున్నాయి.ఈ సమావేశంలో ముఖ్యంగా బీసీ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, అభిమానులు పాల్గొన్నారు.